సాక్షి ప్రకాశం

శనివారం ౹ 23 ౹ సెప్టెంబర్ ౹ 2023



విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతిచెందిన ఘటన బేస్తవారిపేట లలితాంబికా ఆలయ సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

- 8లో..



150 బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం

మార్కాపురం పట్టణంలో ఓ ఇంటర్‌నెట్ సెంటర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇతర రాష్ట్రాలకు చెందిన 150 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గణపతి లడ్డు రూ.లక్ష



లక్ష రూపాయలు పలికిన గణపతి లడ్డు

కురిచేడు: గణపతి లడ్డు వేలంలో లక్ష రూపాయలు పలికింది. గణేశచతుర్థి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో భాగంగా గణపతి నిమజ్జనం సందర్భంగా లడ్డు వేలం పాట నిర్వహించారు. స్థానిక పాత పోలీసుస్టేషను వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద 20 కిలోల లడ్డు, 6 కిలోల లడ్డులు ఉంచారు. వాటిని వేలం వేయగా 20 కిలోల లడ్డును అల్లారాంప్రభు టీం లక్ష రూపాయలకు పాడి కైవసం చేసుకోగా, 6 కిలోల లడ్డును రెయిన్‌బో బాయ్స్ టీం రూ.44 వేలకు పాడింది.

ఈ క్రాప్ సూపర్‌చెక్ జేసీ ఆకస్మిక తనిఖీ



ఈ క్రాప్ సూపర్‌చెక్ తనిఖీ చేస్తున్న జేసీ శ్రీనివాసులు

దర్శి: మండలంలోని ఎర్రోబనపల్లె, చందలూరు గ్రామాల్లో ఈక్రాప్ సూపర్‌చెక్‌పై జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో పొలాలకు వెళ్లి వీఏఏ, వీహెచ్ఏలను పిలిచి వారు చేసిన ఈక్రాప్ ఆ పొలంలో ఉందా లేదా చెక్ చేశారు. వారు నమోదు చేసిన పంట పొలంలో ఉన్న పంటలను పరిశీలించారు. నమోదు చేసిన ఎకరాలు, పంట ఉన్న విస్తీర్ణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి రైతు పంట ఈ క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన అన్నీ పథకాలు వర్తించేలా వారికి సహకారం అందించాలని కోరారు. తెలియని విషయాలు తెలియజేసి వారికి అండగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీ బాలాజీ నాయక్, ఏఓ బాలకృష్ణ నాయక్, వీఏఏ, వీహెచ్ఏలు చంద్రకాంత్, కోటినాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మహిళా బిల్లుపై హర్షం



కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేస్తున్న సమితి సభ్యులు

ఒంగోలు మెట్రో: చట్టసభ సభలో మహిళల రిజర్వేషన్ విషయమై ప్రవేశపెట్టిన మహిళా బిల్లు ఆమోదించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి.. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో ఒంగోలులోని స్థానిక హౌసింగ్ బోర్డ్‌లోని సమితి కార్యాలయంలో కేక్ కట్ చేసితమ హర్షాన్ని వ్యక్త పరిచారు. ఇందులో సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఇది ఎన్నో మహిళా సంఘాల పోరాట ఫలితం అన్నారు. నాడు జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు గీతాముఖర్జీ తదితర వ్యక్తులు మొట్టమొదటి సారిగా మహిళా రిజర్వేషన్ కోసం తమ గళాన్ని విప్పారు. తర్వాత ఎందరో పార్లమెంట్ మహిళా సభ్యులు దీని కోసం ఆందోళన సాగించారు. పరిణామ క్రమంలో ఆలస్యం అయినప్పటికీ ఇప్పటికైనా ఈ బిల్లు ఆమోదం పొందడం చాలా ఆనందంగా ఉందని తమ హర్షాన్ని తెలియజేశారు.

నరసం ప్రకాశం జిల్లా కార్యదర్శి కత్తి కృపావరం మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు స్థానం రావడం వలన ఆరోగ్యకరమైన సంస్కృతి వస్తుందని రౌడీలు గుండాల ప్రమేయం తగ్గుతుందని, ఇది మంచి పరిణామం అన్నారు. సమితి కోశాధికారి బీరం అరుణ మాట్లాడుతూ మహిళలు చట్టసభలలో భాగస్వాములు అవటం వలన నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతారని అన్నారు. మారేపల్లి సూర్యకుమారి, గుంటూరు శ్రీదేవి వేమా సుశీల, సీహెచ్ కనకదుర్గలతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఎంతో ఉత్సాహంగా కేక్ కట్ చేసి సమితి సభ్యులు వేడుకలు చేసుకున్నారు.

రుచి తగ్గిన ఉప్పు



నిల్వ చేసిన ఉప్పు కుప్ప

ధరలు భారీగా పెరిగి రైతులకు కాసుల వర్షం కురిపించిన ఉప్పు.. ఇది నిన్నటి మాట. వాతావరణం అనుకూలించకపోవడం.. మార్కెట్‌లో డిమాండ్ తగ్గడంతో ధరలు అమాంతం పడిపోయాయి. గత ఏడాది అత్యధికంగా 75 కేజీల బస్తా రూ.350 పలకగా తాజాగా 75 కేజీల బస్తా ధర రూ.150కి పడిపోయింది. దీనికి తోడు కౌలు ధరలు సైతం భారీగా పెరిగిపోయాయి. ప్రస్తుతమున్న పరిస్థితులతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, ఉప్పు చేదుగా మారిపోయిందని వాపోతున్నారు.

- భారీగా పడిపోయిన ధరలు
- 75 కేజీల బస్తా ధర రూ.150
- గతేడాది 75 కేజీల బస్తా ధర రూ.350
- పెరిగిన కొఠారుల కౌలు ధరలు
- గతేడాదితో పోల్చితే పెరిగిన ఉత్పత్తి

సింగరాయకొండ:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చినగంజాం, కనపర్తి, పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి పంచాయతీల పరిధిలో పెద్ద ఎత్తున ఉప్పు కొఠారులున్నాయి. సుమారు 4 వేల ఎకరాల్లో ఉప్పు సాగవుతోంది. ప్రతి నెలా సంవత్సరానికి వర్షాకాలం తప్ప మిగిలిన కాలాల్లో అనగా 9 నెలల పాటు ఉప్పు సాగు జరిగేది. ఈ ప్రకారం ప్రతినెలా సుమారు 20 వేల టన్నుల వరకు ఉప్పు ఉత్పత్తి అవుతుంది. ఉమ్మడి జిల్లాలో 7 వేలకు పైగా ఉప్పు రైతులు, సుమారు 10 వేలకు పైగా కూలీలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు.

మూడేళ్లుగా ధరలు భారీగా ఉండడంతో ఉప్పు రైతుల దశ తిరిగింది. గత ఏడాది 75 కేజీల బస్తా రూ.350లకు పైగా పలికింది. పొరుగు రాష్ట్రం తమిళనాడు నుంచి కూడా పెద్ద ఎత్తున వ్యాపారులు ఇక్కడికి రావడంతో అమ్మకాలు జోరుగా సాగాయి. అంతేకాదు తెలంగాణ, మహారాష్ట్రలకు సైతం ఎగుమతి చేశారు. 50 ఏళ్లలో ఎప్పుడూ ఈ స్థాయిలో ధరలు రాలేదని రైతులు సంబరపడిపోయారు. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా తయారైంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. ఏప్రిల్ నెలలో 75 కేజీల బస్తా ధర రూ.210 పలికింది. అదికాస్తా నేడు రూ.150కి పడిపోయింది. వాతావరణం అనుకూలిస్తే సంవత్సరానికి ఎకరాకు వెయ్యి



ఉప్పు కుప్పలపై పట్టలు కప్పి భద్రపరిచిన దృశ్యం

బస్తాలు ఉప్పు ఉత్పత్తి అయ్యేవి. గత సంవత్సరం ధరలు బాగా ఉన్నా వర్షాలు కురవటంతో ఎకరాకు సుమారు 600 బస్తాలు మాత్రమే ఉప్పు ఉత్పత్తి జరిగింది. ఈ సారి ఎకరాకు సుమారు 800 బస్తాలు ఉత్పత్తి అయింది. ఉప్పు తయారయ్యే సమయానికి వర్షాలు కురవటంతో ఉత్పత్తి తగ్గింది. ఏప్రిల్ చివరి వారంలో, జూన్, ఆగస్టు నెలల్లో వర్షాలు కురవటంతో ఉప్పు తయారీకి ఆటంకం ఏర్పడి ఉప్పు దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కొనుగోలుదారుల సంఖ్య కూడా బాగా తగ్గిందని, ఉప్పు నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి ఉందంటున్నారు.

పెరిగిన కౌలు ధరలు

మూడేళ్లుగా ఉప్పు ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది ఉప్పు కొఠారుల కౌలు ధరలు సైతం బాగా పెరిగాయి. బీడు భూములను కూడా బాగు చేసుకుని ఉప్పు సాగు చేశారు. అయితే ఈ సంవత్సరం ఉప్పు ధరలు బాగా తగ్గటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో కూలి పనులకు వెళుతున్నామని రైతులు చెబుతున్నారు.

సిండికేట్లతో నష్టపోతున్నాం..



ఈ సంవత్సరం ఉప్పు సాగు ఆశాజనకంగా ఉంది. గత 50 సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 75 కేజీల బస్తా ధర రూ.300 పలికింది. గతంలో వ్యాపారుల సిండికేట్, వర్షాభావ పరిస్థితుల కారణంగా గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయాం.

– సామంతుల ఆదినారాయణరెడ్డి, ఉప్పురైతు, బింగినపల్లి

తగ్గిన ఉత్పత్తి..



నేను 10 ఎకరాలు కౌలుకు తీసుకుని ఉప్పు సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం ధరలు ఆశాజనకంగా లేదు. గత మూడు సంవత్సరాలుగా ఉప్పు ధరలు బాగా ఉండటంతో కౌలు ధరలు బాగా పెరిగాయి. ఈ సంవత్సరం ఆశించిన స్థాయిలో ఉప్పు ఉత్పత్తి జరగకపోగా ఉప్పు ధరలు పడిపోయాయి.

– పురిణి శ్రీనివాసులరెడ్డి, ఉప్పు రైతు, ఊళ్లపాలెం

నీటి సరఫరా బిల్లుల చెల్లింపులకు సీఎం గ్రీన్ సిగ్నల్

- క్యాబినెట్‌లో సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి ఆదిమూలపు సురేష్
- వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు

యర్రగొండపాలెం: నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన బిల్లులకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో 2019 నుంచి గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేశారు. అందుకు గాను రూ.236 కోట్లు చెల్లించాల్సి ఉంది. అందులో ప్రకాశం జిల్లాలో ట్యాంకర్ల యజమానులకు రూ.130 కోట్లు చెల్లించాలి. అత్యధికంగా బిల్లులు పొదిలి సబ్ డివిజన్ పరిధిలో ఉన్నాయని ఆ ప్రకటనలో వివరించారు. బిల్లుల చెల్లింపుల కోసం నిధులు మంజూరు చేయాలని ఈ నెల 20న జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రి సురేష్ సీఎంను కోరారు. స్పందించిన ఆయన రెండు రోజుల్లో బిల్లులు చెల్లింపులకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని సీఎం హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.236.34 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే నీటి సరఫరా బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఈఎన్‌సీ ఆర్.వి.కృష్ణారెడ్డి సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నుంచి బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమైందని, నీటి సరఫరా ట్యాంకర్ల యజమానులు వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయించుకోవాలని, వాటికి సంబంధించిన బిల్లులు చెల్లింపులు జరుగుతాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి అర్జీ నిర్దిష్ట గడువులో పరిష్కరించాలి

- జేసీ శ్రీనివాసులు

దర్శి: ప్రతి అర్జీని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి తగు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్థానిక శ్రీ శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో శుక్రవారం దర్శి మండల ప్రజలకు «జగనన్నకు చెబుదాం» కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల నుంచి 170 అర్జీలు అందాయి. ఒక విభాగం వారు అర్జీదారుల అర్జీలు పరిశీలించి శాఖల పేర్లు నమోదు చేసి నంబర్లు వేసి పంపారు. జేసీ, ఆర్డీఓలు అర్జీలు పరిశీలించి వారి సమస్యలు ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ అధ్యక్షతన స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నాలుగు నెలలుగా నియోజకవర్గాల కేంద్రాల్లో స్పందన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ స్పందన సేవా కార్యక్రమాలను మరింతగా క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి మండల కేంద్రాల్లో నిర్వహించాలన్నా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి బుధ, శుక్రవారాల్లో జిల్లా స్థాయి అధికారులు మొత్తం మండల కేంద్రాలకు వెళ్లి ఆయా మండలాల పరిధిలో స్పందన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. స్పందన అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. అర్జీలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. అర్జీలు పరిష్కరించలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని దిశా నిర్దేశం చేశారు. గతంతో పోలిస్తే అర్జీలు పునరావృతం అవుతున్న శాతం గణనీయంగా తగ్గినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయి అధికారులు స్పందన అర్జీలను పరిష్కరిస్తున్న తీరును ఆయా శాఖల జిల్లా అధికారులు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అజయ్‌కుమార్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎంవీఎస్ లోకేశ్వరరావు, ఎంపీపీ రవి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే అర్జున్ నాయక్, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ రవిశంకర్, ఎంపీడీఓ కుసుమకుమారి, ఈఓఆర్డీ శోభన్‌బాబు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

ప్రకృతి వ్యవసాయంలో కూరగాయల సాగు బాగుంది

- ప్రకృతి వ్యవసాయం సీనియర్ కన్సల్టెంట్ రామచంద్రం


కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలు అధికంగా పండించడంతో పాటు వారు పండించిన పంటను వారే తినడం ఎంతో సంతోషంగా ఉందని గుంటూరు నుంచి వచ్చిన ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ సీనియర్ కన్సల్టెంట్ రామచంద్రం సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని గాదెపాలెం, కొత్తపట్నం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం కింద సాగుచేస్తున్న రైతుల పొలాలను ఆయన పరిశీలించారు. నిరంతరం ఆదాయం వచ్చే మోడల్స్ ఏ గ్రేడ్ వ్యవసాయ పంటలను పరిశీలించారు. కొత్తపట్నంలో కోమట్ల నాంచార్లరెడ్డి, నాటారు ఆంజనేయులు ఏటీఎం మోడల్స్‌లో 18 నుంచి 22 రకాల కూరగాయలు, ఆకు కూరలు వేయటం తనిఖీ చేశారు. 30 సెంట్ల స్థలంలో రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఖర్చులు పోను ఆదాయం వస్తుందని రైతులు ఆయనకు వివరించారు. అనంతరం గాదెపాలెంలో గుత్తికొండ ఝాన్సీ లక్ష్మి పొలంలో వేసిన ఏ గ్రేడ్ మోడల్ సాగుని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి, సత్యనారాయణ, వికాస్ రెడ్డి, నరసింహులు, రెడ్డిప్ప ఉన్నారు.

పలువురు తహశీల్దార్లకు స్థాన చలనం

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో పలు మండలాల్లో తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సంతనూతలపాడు తహశీల్దారుగా ఉన్న ఎస్ఎల్ నారాయణరెడ్డిని డిప్యుటేషన్‌పై కలెక్టరేట్‌కు మార్చారు. చీమకుర్తి తహశీల్దార్ పీ మధుసూదనరావుకు సంతనూతలపాడు తహశీల్దారుగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. వెలిగండ్ల తహశీల్దారుగా ఎస్ వాసును నియమించగా, కందుకూరు తహశీల్దారు డి మంజునాథరెడ్డిని మార్కాపురం తహశీల్దారుగా నియమించారు. అదేవిధంగా కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏఓగా ఉన్న ఎం హరిబాబును మద్రిపూడి తహశీల్దారుగా నియమించారు. సంతనూతలపాడు డిప్యూటీ తహశీల్దారు బీ రాజశేఖర్ రెడ్డిని కలెక్టరేట్ ఎలక్షన్ సెల్‌కు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్‌లో ఉన్న కే శాంతిని సంతనూతపాడు డిప్యూటీ తహశీల్దారుగా డిప్యుటేషన్‌పై నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వీరితో పాటు సంతనూతలపాడు తహశీల్దార్ కార్యాలయంలో పలువురికి స్థాన చలనం కల్పిస్తూ కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎస్‌కే సుష్మను జరుగుమల్లి తహశీల్దార్ కార్యాలయానికి పంపగా, అక్కడ పనిచేస్తున్న రాజ్యలక్ష్మిని ఎస్ఎన్‌పాడు తహశీల్దార్ కార్యాలయంలో కేటాయించారు. అదేవిధంగా సీనియర్ అసిస్టెంట్ బీ శ్రీనివాసరావును టంగుటూరుకు, అక్కడి సీనియర్ అసిస్టెంట్ పీవీ రమణయ్యను సంతనూతలపాడుకు, జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న పీ ఉపేంద్ర యాదవ్‌ను తాళ్లూరుకు, అక్కడ జూ.అసిస్టెంట్ ఎంవీఎస్ సుధీర్ కుమార్‌ను సంతనూతలపాడు తహశీల్దార్ కార్యాలయానికి కేటాయించారు.



ఒంగోలు చివుకులవారి వీధిలో దీపాలంకరణలో గణనాథుడు

పతిత పావనా.. పార్వతి నందనా

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాలలో వివిధ రూపాలతో అలంకరించిన గణనాథుడు భక్తుల పూజలు అందుకుంటున్నాడు. పలుచోట్ల వినాయక విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు.

చిత్రమాలిక 8లో..

గుండ్లకమ్మకు రూ.9 కోట్లు

- మంజూరు ఉత్తర్వులిచ్చిన సీఎం వైఎస్ జగన్
- సీఎంను కలిసి వివరించిన బాలినేని, టీజేఆర్

చీమకుర్తి: గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతులకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం రూ.9 కోట్లను అందించేందుకు పరిపాలన ఉత్తర్వులు ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతులకు నిధులను విడుదల చేయాలని చేసిన విజ్ఞప్తి చేశారు. వెంటనే సీఎం స్పందించారని నిధుల విడుదలకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్స్ ఇచ్చినట్లు ఎమ్మెల్యే టీజేఆర్ తెలిపారు. గుండ్లకమ్మ ఎగువ నుంచి వచ్చిన వరద నీటి ప్రవాహానికి ఇటీవల ప్రాజెక్ట్‌లోని 3వ గేటు కిందనున్న గడ్డర్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్ట్‌లోని నీళ్లు సముద్రం పాలయ్యాయి. దానిపై చంద్రబాబునాయుడు ఇటీవల గుండ్లకమ్మ ప్రాజెక్టను సందర్శించి లేనిపోని ఆరోపణలు చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. టీడీపీ పాలనా కాలంలో గేట్లు మరమ్మతులకు మంజూరు చేసిన రూ.3 కోట్లను సుందరీకరణ పేరుతో నొక్కేసిన కారణంగానే గేట్లకి తుప్పుపట్టి ఇటీవల వరదలకు మూడో గేటు కొట్టుకుపోయిందనే విషయాన్ని టీడీపీ నాయకులు పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీపై అసత్య ఆరోపణలు చేశారని ఆయన విమర్శించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి విఘాతం లేకుండా ప్రాజెక్ట్ గేట్లకి మరమ్మతులు చేపడతామన్నారు. పనులు సత్వరం చేపడతామని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు చెప్పారు.

పల్లెకు శుద్ధ జలం

- 32 గ్రామాలకు ఆర్‌వో ప్లాంట్లు మంజూరు
- ఒక్కో ప్రాజెక్టు విలువ రూ.9 నుంచి రూ.14 లక్షలు
- మొత్తం వ్యయం రూ.3.25 కోట్లు
- సీఎస్ఆర్ ద్వారా రూ.2.50 కోట్లు మంజూరు చేసిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్
- మిగిలిన రూ.75 లక్షలు ఎంపీ నిధుల నుంచి కేటాయించిన మాగుంట

ఒంగోలు: ప్రజలకు రక్షిత మంచినీరు సరఫరా చేసేందుకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చేసిన యత్నం ఫలించింది. మొత్తం 32 గ్రామాల్లో ఈ నీటి శుద్ధి/ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ముందుగా గ్రామాలను ఎంపికచేసి వాటి అంచనాను రూపొందించారు. దానికి మొత్తం రూ.3.25 కోట్లు అవుతుందని నిర్ధారణ అయింది. దీంతో ఆ మొత్తాన్ని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద మంజూరు చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇటీవల పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను కలిశారు. వారు ఎంపీ మాగుంట అందించిన ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం 32 గ్రామాల్లో నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు అంగీకరించారు. ఈ మేరకు అందులో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద రూ.2.50 కోట్లు మాత్రమే కేటాయించగా, మిగిలిన రూ.75 లక్షలను ఎంపీ నిధుల నుంచి మాగుంట కేటాయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్కో ప్రాజెక్టు విలువ రూ.9 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు ఉందన్నారు. దీనివల్ల 32 గ్రామాల్లో ప్రజలు సురక్షిత తాగునీటిని పొందగలుగుతారని చెప్పారు. త్వరలోనే ఒక్కో ప్రాజెక్టుకు సంబంధించి అగ్రిమెంట్లు కూడా పూర్తవుతాయని, అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణలో వీటిని ఏర్పాటు చేస్తారన్నారు. స్పందించి నిధులు విడుదల చేసిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసే గ్రామాలివీ..

కనిగిరి నియోజకవర్గం: వెంగళాయపల్లి ఎస్సీ కాలనీ, అయ్యవారిపల్లి (పీసీపల్లి మండలం), పోలవరం, యడవల్లి (కనిగిరి), కూటాగుండ్ల (హెచ్ఎంపాడు), గణేశుని కండ్రిక (వెలిగండ్ల), బోయమడుగుల, పెదరాజుపాలెం (సీఎస్‌పురం), తూర్పుకట్టకింద పల్లి, కంభాలదిన్నె రాజాసాహెబ్‌పేట, రావిగుంట పల్లి, దూబగుంట (పామూరు)

మార్కాపురం నియోజకవర్గం: నాగెళ్లముడిపి (తర్లుపాడు మండలం), నాయుడుపల్లి, బోడపాడు (మార్కాపురం)

గిద్దలూరు నియోజకవర్గం: క్రిష్ణంశెట్టిపల్లి (గిద్దలూరు మండలం), కందులాపురం (కంభం), పిటికాయగుళ్ల (బేస్తవారిపేట), అర్లీనగరం (కొమరోలు)

యర్రగొండపాలెం నియోజకవర్గం: చిన్నగుడిపాడు (దోర్నాల మండలం), వైడిపాడు (పెద్దారవీడు), ఐటీవరం (పుల్లలచెరువు), దూపాడు (త్రిపురాంతకం), కొలుకుల (వై.పాలెం)

కొండపి నియోజకవర్గం: బింగినిపల్లి (సింగరాయకొండ మండలం), కోటపాడు (పొన్నలూరు).

దర్శి నియోజకవర్గం: చందవరం, వద్దిపాడు (దొనకొండ మండలం), తుమ్మెదలపాడు (దర్శి), పోలవరం (ముండ్లమూరు), కొర్రపాటివారిపాలెం, లక్కవరం (తాళ్లూరు).

ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలి

ఒంగోలు టౌన్: ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీలకు ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని ఏపీజీఈఎఫ్ చైర్మన్ ఎండ్లూరి చిట్టిబాబు కోరారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇంక్రిమెంట్, ఎస్ఆర్ తదితర సమస్యల గురించి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆ సంస్థ జిల్లా కోశాధికారి కొలకలూరి ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ భరత్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ కె.వెంగళరెడ్డి, ఈసీ మెంబర్ ఫాలోమ్ రాజు పాల్గొన్నారు.



ఎస్పీ మలికా గర్గ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీలు

ఉద్యోగం పేరుతో సివిల్ సప్లయ్ ఉద్యోగి మోసం

ఒంగోలు టౌన్: ఒక నిరుద్యోగ యువకుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ఆశ చూపి లక్షల రూపాయలు వసూలు చేశాడో సివిల్ సప్లయ్ ఉద్యోగి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం బయటపడింది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని సత్యనారాయణపురంలో నివశిస్తున్న షేక్ బాషా బీఎస్సీ చదువుకొని కంప్యూటర్ పనులు చేసుకుంటున్నాడు. ఆయన తండ్రి జాన్ సాహెబ్‌కు సివిల్ సప్లయ్‌లో ఉద్యోగం చేస్తున్న వెంకటేశ్వర్లు పరిచయం అయ్యాడు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకుడిగా చెప్పుకున్న అతడు బాషాకు విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. విజయవాడకు తీసుకెళ్లి సోమశేఖర్, శివ అనే వ్యక్తులతో మాట్లాడించాడు. రూ.7 లక్షలు ఇస్తే ఉద్యోగం ఖాయం అని చెప్పడంతో వారి మాటలను నమ్మేసిన బాషా ఒంగోలుకు వచ్చిన తరువాత బ్యాంకు ద్వారా విడతల వారీగా డబ్బులు చెల్లించాడు. వెంకటేశ్వర్లుకు కూడా నగదు లక్ష రూపాయలు ఇచ్చాడు. మొత్తం రూ.4.60 లక్షలు ముట్టజెప్పాడు. అయితే ఉద్యోగం మాత్రం రాలేదు. ఉద్యోగం సంగతి ప్రస్తావిస్తే సమాధానం రాకపోవడంతో అనుమానం వచ్చిన బాషా శుక్రవారం వన్ టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా


విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

బేస్తవారిపేట: స్థానిక లలితాంబికా ఆలయం సమీపంలో వినాయక మండపం వద్ద విద్యుదాఘాతానికి గురై ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బేస్తవారిపేటకు చెందిన కాల్వ మణికంఠ(17) అర్ధరాత్రి సమయంలో టాయిలెట్‌కు వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. వినాయక మండపం కోసం వేసిన ఇనుప స్తంభాన్ని పట్టుకుని మూత్ర విసర్జన చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే తీవ్ర గాయాలతో మృత్యువాతపడ్డాడు. మణికంఠ బేస్తవారిపేటలోని యశ్వంత్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అర్ధరాత్రి సమయంలో వర్షం ప్రారంభం కావడంతో పది మంది యువకులు వినాయక విగ్రహంపై పట్టాను కప్పి పక్కనే ఉన్న ఆలయంలో పడుకున్నారు. సంఘటన జరిగిన గంట తర్వాత మణికంఠ అపస్మారక స్థితిలో పడి పండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లిదండ్రులు శ్రీనివాసులు, వసుంధర బోరున విలపిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

పొదిలిలో పట్టపగలే చోరీ

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లో నివాసం ఉంటున్న టైలర్ గృహంలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తోట కృష్ణయ్య టైలర్ దుకాణానికి, ఆయన భార్య కూలీ పనికి వెళ్లారు. మధ్యాహ్నం భోజన సమయానికి ఇద్దరూ ఇంటికి వచ్చారు. తలుపులు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. 10 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.


ఒంగోలు : గొడుగుపాలెంలో ప్రత్యేక అలంకరణలో..


సుజాత నగర్‌లో అయోధ్య సెట్టింగ్


నిర్మల్‌నగర్‌లో కరెన్సీతో అలంకరణ


యర్రగొండపాలెంలో విఘ్నేశ్వరుడికి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

జజ్జనకరి జనారే..

కోలాహలంగా గణేశ్ నిమజ్జనాలు

గణనాథుల శోభాయాత్ర ఐదో రోజు గురువారం కనుల పండువగా సాగింది. చవితి రోజు నుంచి మండపాల్లో కొలువుదీరి పూజలందుకున్న లంబోదరుడిని భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనం చేశారు. జై బోలో గణేశ్ మహారాజ్ నినాదాలు మారుమోగాయి. పలు చోట్ల మండపాల్లో గణనాథుడి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


ముండ్లమూరులో కోలాహలంగా గణేశ్ నిమజ్జనం


పొదిలి : రామాపురంలో గణేశ్ శోభాయాత్రలో గ్రామస్తుల సందడి


పాకల బీచ్‌లో గణేశుడి నిమజ్జనం


పామూరులో నిమజ్జనానికి తరలుతున్న పంచముఖ వినాయకుడు


పుల్లలచెరువులో గణనాథుడి ఊరేగింపు

ఆటో ఢీకొని తిరగబడిన ట్రాక్టర్ ట్రక్

- ఒకరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

జరుగుమల్లి: ట్రక్ ఆటో టైరు పేలిపోవడంతో అదుపుతప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రంగా, ఒకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటన జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సింగరాయకొండ వైపు నుంచి టంగుటూరు వైపు జామాయిల్ కర్ర లోడుతో ట్రాక్టర్ వెళ్తోంది. అదే సమయంలో దోసకాయల లోడుతో వస్తున్న ట్రక్ ఆటో టైరు కె.బిట్రగుంట సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద పేలిపోవడంతో అదుపు తప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కు తిరగబడటంతో కర్రపై కూర్చుని ఉన్న టంగుటూరు మండలం వెంకటాయపాలేనికి చెందిన కూలీలు ముగ్గురు కింద పడిపోయారు. తీవ్రంగా గాయపడిన కత్తి గోపి(40)ని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. గోపి భార్య చెంచమ్మకు చేయి విరగడంతోపాటు తీవ్ర గాయాలయ్యాయి. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వెంకయ్య అనే కూలీకి రక్త గాయాలు కాగా ట్రక్ ఆటో క్లీనర్ స్వల్పంగా గాయపడ్డాడు. సంఘటనా స్థలాన్ని జరుగుమల్లి ఎస్సై వి.వెంకటేశ్వరరావు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


టైరు పేలిపోయిన ట్రక్ ఆటో


ప్రమాద స్థలంలో జామాయిల్ కర్ర

విష గుళికలు తిని వృద్ధురాలు మృతి

బేస్తవారిపేట: మండలంలోని చెన్నుపల్లెలో విషగుళికలు తినడంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లక్కమనేని తిరుమలమ్మ(70) అనే మహిళ గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెందిన ఆమె మొక్కజొన్న తోటలోకి వెళ్లి విష గుళికలు తినింది. గమనించిన కుటుంబ సభ్యులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించే క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి భర్త వెంకటయ్య, ఆరుగురు కుమారులు ఉన్నారు.


మృతి చెందిన తిరుమలమ్మ

భూములను జీరో ఖాతా నుంచి తొలగించాలి

పామూరు: రెవెన్యూ రికార్డుల్లో రైతుల పొలాలు జీరో ఖాతాలో పడి ప్రభుత్వ పథకాలు కోల్పోతున్న 5927 మంది రైతులను ఆదుకోవాలని శుక్రవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు అసెంబ్లీ కార్యాలయ ప్రాంగణంలో వినతిపత్రం అందజేశారు. పామూరు మండలంలో మొత్తం 29 రెవెన్యూ గ్రామాలకు సంబంధ/ంచి 79 గ్రామాలుండగా 2012లో భూములు ఆన్‌లైన్ చేశారన్నారు. ఆ సందర్భంగా రైతుల వివరాలను ఖాతా నంబరు స్థానంలో రెవెన్యూ సిబ్బంది జీరో ఖాతాలో నమోదు చేశారని చెప్పారు. దీంతో సంబంధిత రైతులు తమ భూములను ఆన్‌లైన్ చేయించుకునే వీలులేదని దీంతో ప్రభుత్వ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోపాడు రిజర్వాయర్‌కు 2.5 టీఎంసీల నీటిని వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో చేరి డొక్కల వాగు ద్వారా ఇవ్వాలని నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మండలంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను త్వరితగతిన కాంట్రాక్టర్‌తో చర్చించి పనులు మొదలు పెట్టించాలని రోడ్డు భవనాలశాఖ మంత్రికి విన్నవించామన్నారు. పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం కందుకూరు నుంచి కనిగిరి డివిజన్‌కు మార్చాలని మంత్రి బూడి ముత్యాల నాయుడికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాంబాబు, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, ఖాదర్ బాషా, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


మంత్రి ధర్మానకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా, నాయకులు

150 బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం

- నిందితుడు అరెస్టు
- కారు, రెండు ఫోన్లు సీజ్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఒక ఇంటర్నెట్ సెంటర్ అండ్ జిరాక్స్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇతర రాష్ట్రాలకు చెందిన 150 మద్యం సీసాలను శుక్రవారం సీజ్ చేసినట్లు సెబ్ సీఐ రాగమయి తెలిపారు. సప్తగిరి లాడ్జి అండర్ గ్రౌండ్‌లో ఉన్న వెంకట శివ ఇంటర్నెట్ అండ్ జిరాక్స్ షాపులో 72 పుదుచ్చేరి మద్యం బాటిళ్లు, 78 పశ్చిమ బెంగాళ్ రాష్ట్రానికి చెందిన మిలిటరీ మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన షాపు యజమాని ఉమ్మారెడ్డి తిరుపతిరెడ్డిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నగదు లావాదేవీలు జరిపిన రెండు మొబైల్ ఫోన్లు, యానాం నుంచి 72 మద్యం బాటిళ్లు తెచ్చిన ఒక కారును సీజ్ చేసినట్లు చెప్పారు. దాడిలో ఎస్సై పద్మజ, సిబ్బంది జీవీ తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న సెబ్ సీఐ రాగమయి

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ఒంగోలు సెంట్రల్: వ్యాపారం పేరుతో యువకుడి వద్ద నగదు కాజేసి ఆన్‌లైన్ మోసానికి పాల్పడటంపై గురువారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు.. ఒంగోలు నగరంలోని జెడ్పీ కాలనీకి చెందిన మద్దాలి సత్యనారాయణ ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో లాజిస్టిక్ వ్యాపారం గురించిన ప్రకటనను చూసి సంప్రదించాడు. వారికి రూ. రూ.2.38 లక్షలు నగదు ఆన్‌లైన్‌లో పంపాడు. మరికొంత నగదు పంపాలని తరచూ కోరడం, ఎటువంటి మెటీరియర్ పంపకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.